# ఏలీ

# సాతాను పుత్రులుగల దైవజనుడు

## (2:12-4:22)

2:12-4:22లో ఇశ్రాయేలులో విచారకరమైన అపచారము బయటపడింది. దేశము నాయకత్వం లేనిదై ఉంది. అన్ని రంగాల్లోను నాయకత్వం లోటుగా ఉండిపోయింది; ప్రతి మనుష్యుడు తనకు తానే హక్కుకలిగినవాడయ్యాడు. యాజకులు నాయకత్వాన్ని యివ్వగలిగి యుండేవారే. అయితే వారు కూడా దిగజారిపోయినట్టు లేఖనంలో గోచరిస్తుంది. బాలుడైన సమూయేలును హన్నా సమర్పించిన సున్నితమైన కథ మధ్యలో, అంధకారమయమైన రిఫరెన్సు కన్పిస్తుంది: "ఏలీ కుమారులు యెహోవాను ఎరుగక మిక్కిలి దుర్మార్గులై ఉండిరి" (2:12). తత్ ఫలితంగా, అంతా చెడిపోయింది. సమస్యకు మూలము ఏలీ మీదను, అతని యిద్దరు కుమారుల మీదను కేంద్రీకృతమైంది.

షిలోహులో ఏలీ ప్రధాన యాజకుడుగా ఉన్నాడు. అహరోను కుమారులలో అతడు ఈతామారు సంతతివాడు. అందరికంటె చిన్నవాడు. ఏభై ఎనిమిది ఏండ్ల ప్రాయంలో అతడు ఇశ్రాయేలుకు న్యాయాధిపతియై, నలభై సంవత్సరాలు వారికి న్యాయం తీర్చాడు (4:18). అతని గూర్చి మొదట ప్రస్తావించినప్పుడు, డెబ్భై ఏండ్లకు దగ్గర వయస్కుడై యుండవచ్చు. అతనికి వృద్ధాప్యంలో యిద్దరు కుమారులు కలిగారు, వారు అతి గారాబంగా పెరిగారు. వృద్ధాప్యంలో కలిగినవారు తరచుగా అలాగే ఉంటారు. అతడు హన్నాను మందలించడానికి కఠినత్వాన్ని తొందరపాటును కనుపరచాడు, కాని తన పిల్లలను మందలించడంలో చాలా సున్నితంగాను నెమ్మదిగాను ఉన్నాడు.

దేవునికి లోబడి దైవభక్తిగలవాడై ఏలీ అన్ని విధాలా గౌరవాన్ని పొందాడు. మందసాన్ని అతడు ఎంతో గౌరవించాడు. తన జీవితంలో అతడు చేసిన ఒకే తప్పు ఏమంటే, అతడు తన కుమారులను అలక్ష్యం చేశాడు - వారి పట్ల శ్రద్ధ చూపలేకపోయాడు.

అపవాది సంబంధులైన పిల్లలవలన దైవభక్తిగల తల్లిదండ్రులకు మహా గొప్ప శోకము వస్తుందనే విషయం ఈ సంఘటన మనకు తెలుపుతుంది. బిడ్డల భక్తిహీనతవలన భక్తిగల అనేకమంది తల్లిదండ్రులు సమాధి చేరేవరకు కలత చెందారు. ఏలీ విషయంలో యిది తప్పక నిజం.

### హద్దులు అవసరం

అది ఏలీ పెంపకంలోని లోపమే! ఏలీ ఉదారుడైన తండ్రి అనేది నిస్సందేహం. తన కుమారుల పాపాన్ని గూర్చిన సందేశం అతని చెవిని పడినప్పుడు, ఆ వర్తమానాన్ని అతడు పెడచెవిని పెట్టాడు. అతడు వారిని గద్దించాడు కాని కఠినమైన మాటలతో

కాదు. న్యాయాధిపతిగాను, ప్రధానయాజకుడుగాను అతని బాధ్యత స్పష్టంగా ఉంది. వారిని తమ పదవులలోనుండి వెంటనే తొలిగించి మరణ శిక్ష విధించబడవలసి యుండేది (లేవీ. 18:6, 20, 29; 20:10; 21:6, 7, 17, 23). అతని కుమారుల పాపాలు స్పష్టంగా బయటపడుతున్న సంగతి ఏలీ ఎరిగాడు (2:22), అయినా అది మంచిది కాదు అని వారితో చెప్పడంతోనే అతడు సంతృప్తి చెందినట్టున్నాడు. న్యాయం ప్రకారంగా అధికారాన్ని వారిపై ఉపయోగించడం మానుకున్నాడు. నరుల పట్ల, దేవుని పట్ల వారు చేస్తున్న అన్యాయం విషయంలో అతడు బహు సాధువుగా ప్రవర్తించినట్టు ఒక వ్యక్తి అన్నాడు!

మితిమించిన హద్దులలో ఉంచిన కొందరు పిల్లలు సహితం చెడిపోతారు (కొలస్సీ. 3:21), కాని చాలామంది లేకుండా హద్దులు లేనందున చెడిపోయారు. ఈ రెండు విపరీతమైన స్థితుల విషయమై తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. క్రమశిక్షణ విషయంలో కొందరు ఉదారంగా ఉంటారు (3:13; 2:25). "తిట్టు" అనే పదం బలహీనపరచే, లొంగదీసే, లేక శక్తిహీనతగా చేసే దాన్ని సూచిస్తుంది. బలమైన చర్య తీసికొనడంవలన ఏలీ తన కుమారులను క్రమశిక్షణలో పెట్టియుండవచ్చు. అయితే అతడు అలా చేయలేదు. రెండవది, తల్లిదండ్రులు మార్గదర్శకత్వంలో అనుమతిస్తూ ఉంటారు (2:12, 17). తల్లిదండ్రులు దారి చూపకుండా తమకు తామే నిర్ణయించుకొనడానికి విడిచి పెట్టబడిన పిల్లలు – బాధ్యత లేని యువకులుగా ఎదుగుతారు.

"మేము ఎక్కడ తప్పు చేశాం?" అని కొన్నిమార్లు తల్లిదండ్రులు వేసుకునే ప్రశ్నకు జవాబు ఉండదు. కాని ఏలీ ఉన్న పరిస్థితిలో అది దొరికింది. వారి యిష్టానికి వదలి పెట్టడమనేది పిల్లల నాశనానికి (4:11), తన నాశనానికి (4:18), యితరుల నాశనానికి (4:22) త్రోవ తీస్తుంది.

**వారి యిష్టానికి పిల్లలను పెంచడం అనేది ఊహించలేని వ్యతిరేక ఫలితాలనిస్తుంది.** ఏలీ కుటుంబాన్ని గమనించు. ప్రత్యక్ష గుడార సంబంధమైన ప్రవర్తన విషయంలో నమ్మశక్యంకాని తారతమ్యం ఉంది (1:14; 2:13, 14). బలులలో ఒక భాగాన్ని దేవుడు యాజకులకు నియమించాడు (ద్వితీయో. 12:18). ఏలీ కుమారులు దురాశపరులై యింకా ఎక్కువ కావాలని కోరుతున్నారు. చట్టపరంగా ఆరాధనలకు రావలసిన భాగాన్ని వారు తీసికొంటున్నారు (లేవీ. 8:31; 2 దినవృ. 35:13). ప్రజలను దోచుకొనడం చాలదనుకొని, వారు దేవుని కూడా దోచుకోనారంభించారు. క్రొవ్వు దేవుని బలిపీఠంమీద దహించబడాలి (లేవీ. 3:5–17; 7:31, 34), కాని క్రొవ్వు అలా దహింపబడడానికి లేవీ కుమారులు నిరాకరించారు (2:17). అట్టి కార్యాలు దేవదూషణకరమైనవి, అయితే వారు వాటితో ఆగలేదు. ప్రత్యక్ష గుడారము వద్దకు వస్తున్న స్త్రీలతో వ్యభిచరించునంతగా వారి కామం వారిని నడిపించింది (2:22). ఏలీ విరుద్ధమైనవాడు! అతడు పవిత్రమైన దైవభక్తికి ప్రతిరూపమైనవాడు.

మందసం విషయంలో వారికి విరుద్ధమైన భావాలున్నాయి (4:3, 4; 4:13, 18ఎ). ఏలీ కుమారులకు మందసం పట్ల మూఢ నమ్మకం ఉండేది. మతం అనేది వారికి బహిరంగమైన కర్మకాండ మాత్రమే. మందసం వారి దృష్టిలో గూఢమైనది, గారడీలాంటిది.

ఏలీకైతే మందసం పరిశుద్ధమైన భక్తితో కూడింది. యుద్ధ భూమిలోనికి మందసం కొనిపోవడం ఏలీకి యిష్టం లేదు. కాని అతడు తరచుగా విజయవంతమైన ప్రతిఘటనను ఎదిరించక లోబడుతూ ఉండేవాడు. మందసం విషయంలో ఒక్కొక్కరికున్న దృష్టి - దేవుడైన యెహోవా విషయంలో వారికున్న భావనను వ్యక్తపరచుతోంది.

ఒక్కొక్కరు తన సాటి మానవుని చూచే విషయంలో కూడా వ్యత్యాసముంది. అతని కుమారులు స్వార్థపరత్వాన్ని బట్టి నడిపింపబడ్డారు. అపవిత్రత, దురాశ, శీలము లేమి అనేవి అతని కుమారుల గుణగణాలైయున్నాయి. వారి స్వార్థంతో ఇతరులను ఉపయోగించుకొంటూ ఉండేవారు. ఏలీయైతే యితరుల యెడల దయకలిగి యుండేవాడు (1:7) మరియు యితరుల జీవితాల్లో మేలు జరగాలని వాంఛించేవాడు (2:20).

వారు దేవుని అర్థం చేసికొనడంలో తారతమ్యం ఉంది. ఏలీ కుమారులకు దైవభక్తి లేదు. అభ్యాస సంబంధంగా వారు అవిశ్వాసం కలవారు (2:12). దేవునితో వారు సహవాసంగాని, సంబంధంగాని, బాధ్యతగాని లేనివారు (2:12). ఏలీయైతే అందుకు విరుద్ధమైనవాడు (3:18; 4:13).

వారి మధ్య యింతటి స్పష్టమైన వ్యత్యాసాలు ఎందుకు ఉన్నాయంటే, అధికారాన్ని గౌరవించేలా వారి మనస్సుల్లో నాటి, తన కుమారులకు తర్ఫీదు నివ్వడంలో ఏలీ విఫలమయ్యాడు. గారాబం చేసిన పెంపకంలో తరచుగా ఎదురయ్యే విపత్తు ఆలాటిదే.

ఎక్కువ చనువు ఇస్తే భయంకరమైన ఫలితాలు ఆలాటివే. మొదటిగా, కుటుంబం యొక్క గౌరవం నాశనమౌతుంది (2:22-24). పాపం కేవలం పాపితోనే ఆగిపోదు. ప్రతిమానవుడు మరొక మనిషితో సంబంధం కలవాడు. ఏలీ కుటుంబానికి ఉండిన గౌరవం శాశ్వతంగా పోయింది! కుటుంబంలోని సంఘర్షణలు అధికమయ్యాయ్ (2:25). తన కుమారులకు పట్టిన అపాయకరమైన మార్గాన్ని ఏలీ చూచినప్పుడు, వారి చర్యలను అతడు మార్చాలనుకున్నాడు. అయితే అతడు ఆ పనిని బహు ఆలస్యంగా చేయనారంభించాడు. అతని కుమారులు దుష్టత్వం పాతుకొనిపోయి మార్పునొంద నిరాకరించారు. తిరుగుబాటు కన్పించింది. దీనివల్ల కుటుంబంలోని దైవభక్తికి హానికలిగింది (2:29). 2:29లోని మాటలు ఏలీతో మాట్లాడబడడం నమ్మశక్యం కానట్టుంది. ఆయన బలులనే "తృణీకరించినట్టు" ఏలీ నేరం మోపబడ్డాడు. "తృణీకరించడం" (లేక తన్నడం) అనేది - దయగా చూడబడే ఎద్దు బలత్కారంగా కాడిని విదిల్చి వేసినట్టు సూచిస్తుంది. దేవుని ఆజ్ఞలచే ఏలీ ఆలాటి నేరానికి కట్టుబడడానికి యిష్టపడడు! ఏలీ దేవునితో కాక తన కుమారులతో బంధింపబడి ఉండడానికి నిష్టపడ్డాడు. తన పిల్లలను తన దేవుడైన యెహోవాకంటె ఎక్కువగా "ఘనపరచాడు." గనుక యిట్టి ఫలితము సహజమే తన తప్పుకు వ్యక్తిగతమైన బాధ్యతను అంగీకరించడానికి బదులు - దేవుని, సంఘాన్ని, సువార్తికుని ఒక తండ్రి నేరస్థులనుగా ఎంచడం సులభమే.

రెండోది, కుటుంబపు వారసత్వం దుఃఖాన్ని అనుభవించింది (2:33; 4:13-17). ఏలీయును అతని కుమారులును యాజకత్వానికి తగనివారని తమకు తామే రుజువు చేసికొన్నారు. వారి పేర్లు ఏ వంశావళిలోను రావు! మందసం పోగొట్టబడిన దానితోను, షిలోహులోని ప్రత్యక్ష గుడారం పడిపోవడంతోను వారు ఎల్లప్పుడు గుర్తింపబడ్డారు.

కుటుంబంలో పాపాన్ని బట్టి, కుటుంబ బలాన్ని ఛేదిస్తానని ప్రతిజ్ఞయిచ్చాడు (2:31). ఈ వాగ్దానం యుద్ధ భూమిలో (4:11); షిలోహు యొక్క పతనంలో (కీర్తన. 78:60నుండి); చివరిగా నోబులో నెరవేర్చబడింది (22:18).

ఏలీ గంభీరమైన కథలో ఎలా ఒక మనుష్యుడు దైవభక్తుడైయుండియు తన పిల్లలను "అపవాది పిల్లలుగా" పెంచే అవకాశం గోచరిస్తుంది. మందసం పట్టబడిన రోజున, ఏలీయు, అతని కుమారులు చనిపోయారు. ఆ దుఃఖకరమైన ఆ దినాన, ఏలీ యింటిలో ఒక బిడ్డ పుట్టగా, ఇశ్రాయేలీయులలోనుండి "మహిమ తొలిగిపోయెను" (ఈకాబోదు) అని పేరు పెట్టబడింది (4:21). ఏలీ కుటుంబం అంతానికి అది తగిన పేరే. గారాబంగా పెంచబడి చెడిపోయిన పిల్లలవల్ల ఆయస్సంతా వంగిపోయింది!

## నేర్చుకున్న పాఠాలు

మొదటిది, తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచేటప్పుడు వారు ఏమి చేయకూడదో – ఏలీ యొక్క విఫలత్వం మనకు తెలుపుతుంది. దేవుని ఆజ్ఞలను మనం తేలికగా ఎంచకూడదు (2:27–29ఎ). దేవుని కంటె మీ పిల్లలను ఎన్నడు అధికంగా గౌరవించి – వారి తప్పులకు సాకులు వెదకకుండగను (2:29బి), వాటిని సమర్థించు కొనకుండను జాగ్రత్తపడాలి (2:29సి). బిడ్డలను పెంచే నీ బాధ్యతను తేలికగా ఎంచకు ఎందుకంటె, నీ బిడ్డ చేసేది యితరుల మీద గొప్ప ప్రభావాన్ని చూపుతోంది (2:30–36).

రెండవది, ఏలీ భయంకరమైన ఓటమి – పిల్లలను పెంచడంలో ఎల్కానా, హన్నాలు ఉపయోగించిన సూత్రాల అవసరతను నొక్కి చెప్తుతుంది. బిడ్డ దేవుడు ప్రసాదించిన గొప్ప బహుమానమనియు, బిడ్డను పొందడం గొప్ప బాధ్యతను కలిగిస్తుందని గమనించాలి. దేవుని కొరకు మహా గొప్ప కార్యాలను చేసేవాడు కావాలనే దృష్టితో నీ బిడ్డను పెంచ ప్రయత్నించే లేక ప్రయాసపడే అవసరం ఉందని గుర్తించు. "తాను జీవించినంత కాలము" నీ బిడ్డకు ఉపదేశించనవసరం ఉందని గమనించు. తాము ఎరిగిన దానిని మాత్రమే తల్లిదండ్రులు బోధిస్తారు, వారు కలిగియుండిన గుణగణాలనే వారు ప్రదర్శింపగలరు. ఆయనను వారు గౌరవించే మేరకే తమ పిల్లలయందు భక్తిని పెంచగలరు.

## ముగింపు

బిడ్డలను పెంచడమనేది బహు "సున్నితమైన" పనియై ఉంది. బిడ్డలు దైవమార్గంలో పెరగాలంటే అలౌకికమైన జ్ఞానం తల్లిదండ్రులకు అవసరం. తల్లిదండ్రులు పొరపాటు చేస్తారు, కాని దేవునికి భయపడి, దేవునియందలి భయభక్తులను తమ పిల్లలయందు నాటాలని కోరే తల్లిదండ్రులు తక్కువ తప్పులు చేస్తారు!

పిల్లల చపల చిత్తానికి "తల ఒగ్గి" వారడిగిందల్లా ఇవ్వడం మేలు కాదనే విషయం ఏలీ గుర్తించలేకపోయాడు. అతడు హృదయం భగ్నమై చనిపోయాడు. ఎందుకంటె, దేవుని అధికారపు కాడిక్రిందికి అతడు తన పిల్లలను లోబరిచినవాడు కాదు! (3:13).